వుంచాడు.

భూమిలో వివిధ పొరల నుంచి తీసిన మట్టి శాంపిల్స్‌ను బృహస్పతి స్వయంగా తయారు చేసిన కంప్యూటర్‌లోకి ఫీడ్ చేసి వచ్చిన రిజల్ట్సును తనే రికార్డు చేసుకునేవాడు. అందువలన రిపోర్టు వివరాలు నాకు తెలిసే అవకాశం లేకుండా పోయింది'' అన్నాడు ప్రకాశ్ నెమ్మదిగా.

''మరి అవధూతేంద్ర స్వామి ఆశ్రమంలో ఆయిల్ వుండొచ్చేమోనని'' చెప్పావన్నాడు అయ్యంగార్. అందు వల్లనే స్వామిని అతని కవల సోదరుడిని, చంపించి వేసాము!'' ధవళహాస మాటలకు ప్రకాశ్ కొంచెం తొట్రుపాటు పడి మళ్ళీ సర్దుకుని;

''ఆశ్రమంలోని వివిధ ప్రదేశాలలోని మట్టి శాంపిల్స్ అనేకమార్లు తెప్పించి కంప్యూటర్‌లో ఫీడ్ చేస్తున్నందు వల్ల అలా అనుకున్నాను!''

''అమృత కలశం ప్రాజెక్టు రిపోర్టు ప్రభుత్వానికి ఇంకా అందలేదని హోం మినిస్ట్రీలో వున్న మా ఎటిబి సభ్యుడు తెలియజేశాడు.

బృహస్పతి రిపోర్టు ఏం చేశాడో తెలియరాలేదు.

అతను ఆ రిపోర్టు తన స్నేహితులెవరివద్దనైనా దాచి వుంచాడా?

బృహస్పతి ఈ విషయంలో ఎవర్నీ నమ్మేవాడు కాదు! తన దగ్గర పనిచేసే అసిస్టెంట్‌లకు గాని, స్నేహితులకు గాని ఆఖరుకు భార్యకుగాని రిపోర్టు విషయాలు చెప్పడు. రిపోర్టు దాయమని ఇవ్వడు. రిపోర్టు ఆయన వద్దనే, బహుశ ఆయన రూంలోనే వుండి వుంటుంది!''

''బృహస్పతి రూమ్ క్షుణ్ణంగా వెతికించాము! మా సభ్యులకు ఆ రిపోర్టు ఆచూకి తెలియలేదు!''

''వేరెవరైనా బృహస్పతి గదిలోకి వెళ్ళారేమో ఆలోచించారా మిస్టర్ చాంగ్‌లింగ్''

''వాచ్‌మన్ వీరన్న పోలీసులకు చెప్పిన వాఙ్మూలంలో శశాంక అనే అతను తప్ప మరెవరూ బృహస్పతి కోసం రాలేదు'' అన్నాడు చాంగ్‌లింగ్ సాలోచనగా.

క్షణమాగి ''శశాంక విషయమై నాకు ఇదివరకే అనుమానం వుంది! అందుకే అతన్ని ఇక్కడకు తెమ్మన్నాను!'' అని అంటూండగానే అయ్యంగార్ శశాంకను, చింటూను గదిలోకి నడిపించుకు వచ్చాడు.

''సార్! ఇదుగో శశాంక!'' అంటూ శశాంకను చాంగ్‌లింగ్ ముందుకు నెట్టాడు.

ప్రకాశ్‌ను చూచిన చింటూ ముఖం సంతోషంతో విప్పారింది.

''డాడీ! డాడీ! శశి! అదుగో మా డాడీ'' అంటూ పరిగెత్తుకుని ప్రకాశ్ దగ్గరకు వెళ్ళి అతని ఒళ్ళో కూర్చున్నాడు.

''అరే! చింటూ! నువ్వెలా వచ్చావు?'' అన్నాడు ప్రకాశ్.

''మరి ఈ శశి బస్సులో ఎక్కి కూర్చుని వుంటే 'శశీ ఎందుకు ఇక్కడున్నావ్' అని అడిగాను. ఇంతలో చాలామంది వచ్చి నన్ను తిట్టి కొట్టబోయారు.

తర్వాతేమో ఇక్కడకు తీసుకువచ్చారు''

''సారీ చాంగ్‌లింగ్ ఐ విల్ సీ దట్ చింటూ విల్ నాట్ గివ్ ఎనీ ట్రబుల్ టు యు.''

''ఏమయ్యా అయ్యంగార్! శశాంకను తీసుకురమ్మంటే చింటూని కూడా తెచ్చావు?'' అన్నాడు చాంగ్‌లింగ్.

''సార్! ఆ ఎలుగ్గొడ్డు భీంసింగ్ వీళ్ళను ఆ బస్సులోనే ఖూనీ చేసేట్లు కనపడ్డాడు.

తెలుసుకోవాల్సిన వాళ్లు మాటలు తెలియకుండా మనుష్యుల్ని సఫా చేస్తే తరువాత విచారించాల్సి వుంటుందని వాళ్ళిద్దర్నీ ఇలా తెచ్చాను!''

''నీకు బుద్ధి తప్ప కండబలం లేదు. ఆ భీంసింగ్‌కు కండబలం తప్ప బుద్ధిలేదు! సరే నువ్వెళ్ళింక'' అంటూ అయ్యంగార్‌తో అని ప్రకాశ్ వంక తిరిగి ''మిస్టర్ ప్రకాశ్! చింటూని తీసుకుని మీ రూమ్‌కు వెళ్ళండి'' అన్నాడు.

ప్రకాశ్ చింటూని తీసుకు వెళ్తుంటే చింటూ ''డాడీ! శశి!'' అంటూ శశాంక వంక చూపించ సాగాడు.

''చింటూ అతని సంగతి మనకెందుకు వెళ్దాం పద'' అంటూ చింటూని ఎత్తుకుని వెళ్ళిపోయాడు ప్రకాశ్.

ప్రకాశ్, చింటూ అవతలకు వెళ్ళగానే చాంగ్‌లింగ్ ''మిస్టర్ షంషేర్ శశాంక నోటికి, కళ్ళకు గంతలుండడం ఏం బాగులేదు!'' అన్నాడు.

షంషేర్ శశి నోటిమీద ప్లాస్టర్, కంటికి కట్టిన గంతలు తీసివేశాడు.

''మిస్టర్ శశాంక, వెల్‌కం! ఎటిబిసంస్థ తరపున నీకు మా శుభాకాంక్షలు'' అన్నాడు చాంగ్‌లింగ్.

శశి మాట్లాడకుండా మిన్నకుండేసరికి ''మిస్టర్ శశీ! భారతదేశ ప్రజల నిజమైన మిత్రులమైన మాతో సహకరించు! దేశ భక్తి పరులైన నీ వంటి యువకులు మాకు అండగా వుంటే మా ఎటిబి సంస్థ సాధించలేనిదేమున్నది?'' అంటూ పెదాలు దవడలపైకి వెళ్ళేలా నవ్వాడు.

''మీరంటున్నదేమో నాకర్థంకావడంలా! మా బావకు జొరం తగిల్తే పని చెయ్యడానికి వచ్చాను'' అన్నాడు శశి అమాయకంగా ముఖంపెట్టి.

చాంగ్‌లింగ్ సైగ చేయగా షంషేర్ వెళ్ళి శశి నెత్తిన వున్న విగ్, గడ్డం తీసివేశాడు. కింద వున్న పిల్లి గడ్డం, కోరమీసం కూడా వూడి షంషేర్ చేతిలోకి వచ్చాయి.

''నాకేం తెల్దు!'' అంటున్న శశి ముందు అతని ఫోటో వుంచి —

''ఇదిగో నీ ఫోటో! మిస్టర్ శశాంక, నీ గురించి పూర్తి వివరాలున్నాయి మా దగ్గర! మమ్మల్ని బుకాయించాలని చూడకు'' అన్నాడు చాంగ్‌లింగ్.

మాట్లాడకుండా నిల్చున్న శశితో ''మాతో సహకరిస్తే నీవు కోరిన డబ్బు ఇస్తాం! లేదా చిత్రహింసల పాలై మరణిస్తావు!

ఎటిబి కబంధ హస్తాలలో మరణిస్తావో, స్నేహహస్తం చాచి సుఖపడ్తావో తేల్చుకో మిత్రమా!'' అన్నాడు.

''చాంగ్‌లింగ్! 'మిత్రమా' అనే పదం విలువను విలువునా ఖూనీ చేయకు!

# రక్త''కల''శం

''మా మెడికల్ కాలేజీ వాళ్ళందరం కలిసి అరకు లోయ ''టూర్'' వెళ్ళాము. మా క్లాస్ రిప్రెజెంటేటివ్, మాతో వచ్చిన ప్రొఫెసర్లు నియమావళి బస్సులోనే అందరికి చెప్పారు. బస్సు కొండ ఎక్కుతుంటే బస్సులో నుండి పక్కనే ఉన్న లోయలలోకి చూస్తుంటే ఒళ్ళు జలదరిస్తుంది. బస్సు కంట్రోలు తప్పి కాస్త పక్కకు పోయిందంటే ఇంకేమైనా ఉందా? ఎవరి బిడ్డ ఎవరో? ఎవరెక్కడ ఉన్నారో తెలియని పరిస్థితి ఏర్పడుతుంది. పక్కన బస్సు లోయలోకి పోకుండా చిన్న రాళ్ళు అడ్డం పెట్టారు. బస్సు వెళ్ళిపోవటానికి అవి అడ్డు కాదు. ''గట్టి గోడ కడితే గవర్నమెంట్ సొమ్మేం పోయింది?'' అనుకున్నాను.

బస్సులో అందరూ ప్రొఫెసర్‌తోసహా గొడవ చేస్తున్నారు. అంటే ఎంజాయ్ చేస్తున్నారు. అమ్మాయిలకు అసలు అదుపే లేదు. డ్రైవరు అంతకు ముందు ''బస్సు కొండెక్కేటప్పుడు ఎవరూ మాట్లాడవద్దు!''



అని హెచ్చరించిన సంగతి గుర్తొచ్చి వాళ్ళ గొడవ పట్ల తీవ్ర అసహనంగా ఫీలయ్యాను. వాళ్ళు బస్సును లోయలోకి దారి పట్టిస్తారేమోనని దిగులు పట్టుకుంది.

త్రుటిలో జరిగిపోయింది దారుణం. నేను భయపడ్డది నిజమయింది. క్షణం వరకు ఆనందంగా ఉన్నవారు మరుక్షణంలో వంద అడుగుల క్రింద చెట్టు ఆపగా దొర్లి దొర్లి నిలబడిన బస్సులో ఎవరే పరిస్థితిలో ఉన్నారో ఎవరికీ తెలియదు. నేను మాత్రం కాలు బస్సులో ఇరుక్కోగా బయటకు వేలాడుతున్నాను. కొంతసేపయిన తరువాత బస్సు నుండి విడిపోయి దొర్లుకుంటూ వెళ్ళి ఓ పెద్ద బండమీద పడ్డాను. స్పృహలోనే ఉన్న నేను ధారాపాతంగా కారుతున్న రక్తం పక్కనే ఉన్న ఆకు చిన్న కలశంలా చేసి అందులో పట్టాను. ''దేహంలో రక్తం నష్టమైనప్పుడు రక్తం త్రాగడం మంచిదే అని ఫిజియాలజీ ప్రొఫెసర్ చెప్పిన సంగతి ఆ టైములో గుర్తుంది. అలాగే అతికష్టం మీద త్రాగేశాను'' ఉలిక్కిపడి లేచాను. ఎక్కడున్నాను అని చుట్టూ చూశాను. హాస్టలు గది. ''హమ్మయ్య ... కలే'' అనుకుని నీళ్ళు తాగి, చెమట తుడుచుకున్నాను.

—బలరామకృష్ణన్

అమృతకలశం క్రైం కథల పోటీలో ఎన్నికైన కథ